ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
గురువారం 22 ఆగస్టు 2024





'ఎసెన్షియా' కంపెనీ వద్ద బుధవారం అర్ధరాత్రి అధికారులతో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

# విరుచుకుపడిన మృత్యువు




'ఎసెన్షియా' అడ్వాన్స్‌డ్ సైన్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ వద్ద గుమిగూడిన జనం

## 'ఎసెన్షియా' ఫార్మాలో పేలుడు

### 18 మంది మృతి, 30 మందికి తీవ్ర గాయాలు

- అనకాపల్లి, అచ్యుతాపురం ఆస్పత్రుల్లో క్షతగాత్రులు
- ఏ- షిఫ్ట్ ఉద్యోగులు విధులు ముగించుకుని ఇంటికి వెళ్లే సమయంలో ఘటన
- భవన శిథిలాల కింద చిక్కుకున్న ఉద్యోగులు
- కర్మాగారంలో హాహాకారాలు

మృత్యువు కరాళ నృత్యం చేసింది. భారీ శబ్దంతో కార్మికులపై విరుచుకుపడింది. పనిగంటలు ముగిసి, ఇంటికి వెళ్లేందుకు సమాయత్తమవుతున్న తరుణంలో పేలిన రియాక్టర్ కొందరి శరీరాలను తునాతునకలు చేసింది. రసాయనాలతో కూడిన పొగ కమ్మేసి కొంతమంది ఊపిరి తీసేసేంది. ఘటనలో మొత్తంగా 18 మందిని తిరిగిరాని లోకాలకు తీసుకుపోయింది. మరెంతో మందిని తీవ్రంగా గాయపరిచింది. బాధితుల హాహాకారాలు, ఆర్తనాదాలతో పరిశ్రమ ప్రాంగణం భీతావహ దృశ్యాన్ని తలపించింది.



**అచ్యుతాపురం, ఆగస్టు 21:** ఎప్పటిలాగే అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల పరిధిలో గల ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్)లోని 'ఎసెన్షియా' అడ్వాన్స్‌డ్ సైన్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ కార్మికులంతా బుధవారం ఉదయం విధులకు హాజరయ్యారు. సమయం సరిగ్గా మధ్యాహ్నం 1.50 గంటలు అయింది. ఏ- షిఫ్ట్ ముగిసింది. అప్పటికే బీ- షిఫ్ట్‌కి వాహనాల్లో ఉద్యోగులు వచ్చారు. వీరంతా వాహనాలు దిగి కర్మాగారంలోకి ప్రవేశిస్తున్నారు. ఈలోగా ఏ- షిఫ్ట్ ముగించుకొని కార్మికులు కార్మాగారం భవనం నుంచి బయటకు వస్తున్నారు. ఇంకో ఐదు నిమిషాల్లో వారు బయటకు వచ్చేస్తారు. బీ- షిఫ్ట్ ఉద్యోగులు వాహనాలు దిగి కర్మాగారం ప్రధాన గేటు దాటి లోనికి ... మిగతా 8వ పేజీలో




అచ్యుతాపురంలో ఓ ప్రైవేటు ఆస్పత్రి వద్ద క్షతగాత్రుల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ విజయకృష్ణన్



విలపిస్తున్న మృతుడు వెంకటసాయి కుటుంబ సభ్యులు

## నేడు సీఎం రాక



**విశాఖపట్నం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి):** 'ఎసెన్షియా' ఫార్మా కంపెనీని గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సందర్శించనున్నారు. ఆయన ఉదయం 10.30 గంటల తరువాత విజయవాడ నుంచి విమానంలో విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. ఇక్కడ నుంచి హెలికాప్టర్‌లో అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌కు వెళతారు. అనంతరం అనకాపల్లిలో ఎన్టీఆర్ ఏరియా ఆస్పత్రి, మరికొన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఆయన పరామర్శిస్తారు. అక్కడ నుంచి నగరానికి చేరుకుని కేజీహెచ్ చికిత్సపొందుతున్న క్షతగాత్రులను పరామర్శించనున్నారు.

## క్షతగాత్రుల వివరాలు

ఎ.పరమేష్ (ఎలమంచిలి), పంగా శ్రీనివాస్ (టెక్కలి), ఎం.లోవ శ్రీనివాస్ (విశాఖపట్నం), పి.దేముడు (బోయపాలెం), పి. జగదీశ్వరరావు (నక్కపల్లి), పొన్నాడ జగదీష్ (గాజువాక), పి.ధనుంజయ (ఒడిశా), తమరాన గంగాధర్ (తీడ), జీరెడ్డి కాశినాయుడు (నర్సీపట్నం), గెద్ద సంతోష్ (విజయనగరం), జి.సాయికుమార్ (బోనంగి), జాగారపు ప్రకాష్ (వేపాడ), ఎన్.అప్పారావు (రాంబిల్లి నేవీ కాలనీ), భూపతి శివవెంకటరత్నం (రాంబిల్లి), డి.అప్పారావు (ఎలమంచిలి), కె.నారాయణరావు (శ్రీకాకుళం), ప్రభాత్ యాదవ్ (వరంగల్), చందక బంగారు నాయుడు (విజయనగరం), కె.చంద్రశేఖర్ (బొబ్బిలి), జాగారపు వర్దన్ (జంగాలపాలెం), పి.జి.రాజా (రాంబిల్లి మండలం వెంకటాపురం), బి.సూరిబాబు (వై.లోవ), కె.రాంబాబు (రాంబిల్లి) ఎం.కిరణ్ సత్యనారాయణ (గాజువాక శ్రీనగర్) బి.రామునాయుడు, సీహెచ్ అప్పలరాజు, సత్యనారాయణ, నరేష్‌రెడ్డి, జీఎస్ వరప్రసాదరాజు, పి.అరుణకుమార్ (ఏ ప్రాంతానికి చెందినవారో తెలియాల్సి ఉంది). వీరంతా అచ్యుతాపురం, అనకాపల్లి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.



రాఖీ పౌర్ణమి సందర్భంగా సోదరులకు రాఖీ కట్టేందుకు కాకినాడ వెళ్లిన చల్లపల్లి హారిక బుధవారం తెల్లవారుజామున అచ్యుతాపురం వచ్చింది. కుటుంబ సభ్యులు ఉండమని అడిగినా సెలవు అయిపోయిందని చెప్పి విధులకు హాజరై రియాక్టర్ పేలిన ఘటనలో ప్రాణాలు కోల్పోయింది.









క్షతగాత్రులు

# పరిశ్రమల్లో మొక్కుబడిగా తనిఖీలు

### ఫార్మా కంపెనీల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా మారని అధికారుల తీరు

**(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)**

జిల్లాలోని అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల పరిధిలోని సెజ్‌లో తరచూ ప్రమాదాలు జరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. అయినా పరిశ్రమల యాజమాన్యాలు సరైన భద్రతా చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది.

అచ్యుతాపురం ఎస్ఈజెడ్, పరవాడ, రాంబిల్లి మండలాల పరిధిలో 145కి పైగా పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో గత పదేళ్లలో 48కి పైగా అగ్ని ప్రమాదాలు జరిగాయి. ఆయా ప్రమాదాల్లో అనేక మంది ఉద్యోగులు, కార్మికులు మృతి చెందారు. వందలాది మంది క్షతగాత్రులయ్యారు. పరవాడ మండలంలో రెండేళ్ల కిందట ప్రముఖ ఫార్మా కంపెనీలో ఐదుగురు ఉద్యోగులు మృతి చెందగా, పలువురు గాయాలపాలయ్యారు. ఏడాది కిందట అచ్యుతాపురం ఎస్ఈజెడ్‌లో జీఎంఎఫ్ఎస్‌సీ ల్యాబ్‌లో రియాక్టర్ పేలి ఒకరు మృతి చెందగా, నలుగురు క్షతగాత్రులయ్యారు. పరవాడలోని ఓ కెమికల్ కంపెనీలో ముగ్గురు కార్మికులు అప్పట్లో మంటల్లో చిక్కుకొని చనిపోయారు. 2023 జూన్ నెలలో రాంబిల్లి మండలం సాయితీ ఫార్మా కంపెనీలో అగ్నిప్రమాదం జరిగి ఇద్దరు ఉద్యోగులు మృతి చెందారు. నలుగురు గాయాలపాలయ్యారు. గత ఏడాది వసంత కంపెనీలో అగ్నిప్రమాదం జరిగి ఒడిశాకు చెందిన ఒకరు మృతి చెందారు. తాజాగా రాంబిల్లి మండలంలోని ఎసెన్షియా ఫార్మా కంపెనీలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది.



**తూతూమంత్రంగా తనిఖీలు**

ఫార్మా కంపెనీల్లో ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, కార్మిక, అగ్నిమాపక శాఖల అధికారులు ఏడాదిలో కనీసం నాలుగు పర్యాయాలు తనిఖీలు చేయాలి. కానీ మొక్కుబడిగా తనిఖీలు చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పరిశ్రమల్లో ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందాలి

**అవసరమైతే ఎయిర్ అంబులెన్స్‌లు వినియోగించండి**

- ప్రమాద సంఘటనపై ఉన్నతస్థాయి దర్యాప్తు నివేదిక ఇవ్వాలి
- అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం
- ప్రతి బాధితుడిని ఆదుకునే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని హామీ

**అనకాపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి):** అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లో జరిగిన ప్రమాదంలో గాయపడిన ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. ఈ ఘటనపై జిల్లా అధికారులు, పరిశ్రమల శాఖ, ఆరోగ్యశాఖ అధికారులతో పాటు జిల్లాలో ప్రజాప్రతినిధులతో చంద్రబాబు బుధవారం సాయంత్రం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రుల్లో క్షతగాత్రుల వివరాలు, వారి ఆరోగ్య పరిస్థితి, వైద్య సేవలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రుల్లో వైద్యులను అందుబాటులో ఉంచి మెరుగైన వైద్యం అందించాలన్నారు. అవసరమైతే పరిస్థితి విషమించిన బాధితులను ఎయిర్ అంబులెన్స్‌లను వినియోగించి మెరుగైన వైద్యం కోసం తరలించాలన్నారు. ఇప్పటి వరకు 17 మంది మృతి చెందారని, మరికొందరి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని సీఎంకు కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. ప్రమాదానికి దారితీసిన కారణాలను వివరించారు. ప్లాంట్ నిర్వహణలో మానవ తప్పిదం, నిర్మాణంలో జరిగిన లోపాలను వెల్లడించారు. ప్రమాదం జరిగిన అనంతరం ఫార్మా కంపెనీ యాజమాన్యం సరైన రీతిలో స్పందించలేదని పలువురు అధికారులు సీఎం దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ ముందు బాధితుల ప్రాణాలు కాపాడేందుకు ప్రతి ఒక్క అధికారి కృషి చేయాలన్నారు. ప్రమాదంలో ఇంత మంది ప్రాణాలు కోల్పోవడం తనను కలచివేసిందని, ప్రమాద సంఘటనపై ఉన్నతస్థాయి దర్యాప్తు నివేదికను ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ప్రతి ఒక్క బాధితుడిని ఆదుకునే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని సీఎం హామీ ఇచ్చారు.

# ఎస్సీ వర్గీకరణపై నిరసన వెల్లువ

- జిల్లాలో భారత్ బంద్ ప్రశాంతం




చోడవరం ప్రధాన రహదారిపై ఆందోళన చేస్తున్న మాలమహానాడు నాయకులు, కార్యకర్తలు

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును నిరసిస్తూ మాలమహానాడు ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన భారత్ బంద్ జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. మాలమహానాడు నాయకులు, కార్యకర్తలు ఉదయం నుంచి పలు మండలాల్లో ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. బంద్ కారణంగా ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు, పలు చోట్ల దుకాణాలు మూతపడ్డాయి.

# గోవాడ షుగర్స్ కార్మికుల ఆందోళన

### వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్

- ఎండీ చాంబర్ వద్ద బైఠాయించి నిరసన
- వారంలోగా విధులకు పిలుస్తామని, నెలాఖరుకల్లా బకాయి వేతనాలు చెల్లిస్తామని ఎండీ హామీ



గోవాడ ఫ్యాక్టరీలో ఎండీ చాంబర్ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

**చోడవరం, ఆగస్టు 21:** గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో బుధవారం కార్మికులు ఆందోళనకు దిగారు. తమను వెంటనే విధుల్లోకి తీసుకోవడంతో పాటు వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎండీ చాంబర్ వద్ద కార్మికులు బైఠాయించారు. ఈ సందర్భంగా షుగర్ ఫ్యాక్టరీ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శరగడం రామునాయుడు మాట్లాడుతూ కార్మికులను నెలల తరబడి విధుల్లోకి తీసుకోకుండా ఫ్యాక్టరీని ఎలా నడిపిస్తారని యాజమాన్యాన్ని ప్రశ్నించారు. ఫ్యాక్టరీ గుర్తింపు కార్మిక సంఘం యాజమాన్యంతో కుమ్మక్కై కార్మికుల ప్రయోజనాలను గాలికివదిలేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఎండీ వి.సన్యాసినాయుడు మాట్లాడుతూ కార్మికులను వారంలోగా విధులకు రీకాల్ చేస్తామని, వేతన బకాయిలు నెలాఖరుకు చెల్లిస్తామని, ఇతర సమస్యలు కూడా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు రాయి సూరిబాబు, దాడి నాగేశ్వరరావు, కేఎస్ ప్రకాశ్, శరకాన అప్పలనాయుడు, డి.వెంకట రమణ పాల్గొన్నారు.

# ఆస్పత్రుల్లో హాహాకారాలు

అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లో జరిగిన ప్రమాదంలో మృతుల కుటుంబాల రోధనలు, క్షతగాత్రుల ఆక్రందనలతో పలు ఆస్పత్రుల వద్ద విషాద వాతావరణం నెలకొంది. మరోవైపు.. కార్మికులు, చనిపోయిన వారి కుటుంబాలకు న్యాయం చేయాలంటూ కార్మిక సంఘాలు ఆగ్రహంతో ఆందోళనకు దిగాయి. అంబులెన్స్‌ల ఎదుట కార్మికులు నిరసనకు దిగారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు.. బాధితులను పరామర్శించారు. న్యాయం చేస్తామంటూ భరోసా ఇచ్చారు. ప్రమాదంలో మృతి చెందిన వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.


ఉషాప్రైమ్‌లో క్షతగాత్రుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ


అంబులెన్స్‌కు అడ్డంగా కూర్చుని నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికుడు


గాయాలపాలైన సత్యనారాయణ, మోహనసతీష్


ఎన్టీఆర్ వైద్యాలయంలో వైద్యులతో మాట్లాడుతున్న ఏఏస్పీ దేవప్రసాద్



తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ అంబులెన్స్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మృతి చెందిన కార్మికుల కుటుంబ సభ్యులు, బంధువులు, కార్మిక సంఘాల నేతలు


అచ్యుతాపురం ప్రైవేటు ఆస్పత్రిలో క్షతగాత్రులను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ బాలాజీ తదితరులు


తీవ్ర గాయాలకు గురైన ఓ కార్మికుడు




పోస్టుమార్టం నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించిన మృతదేహాలు


ఎన్టీఆర్ వైద్యాలయంలో చికిత్స పొందుతున్న చైతన్య


తీవ్ర గాయాలకు గురైన బాబా శ్రీనివాసవర్మ


ఘటనా స్థలం వద్ద డీఐజీ గోపీనాథ్ జెట్టీ

---

క్రైం... crime news

## ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య


రాఘవరావు (ఫైల్)

**సబ్బవరం, ఆగస్టు 21:** వ్యక్తిగత సమస్యలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలి. వంగలి గ్రామానికి చెందిన యర్రా రాఘవరావు (32)కు పదేళ్ల క్రితం అనకాపల్లి మండలం సింహాద్రిపురానికి చెందిన వసుధతో వివాహం జరిగింది. వీరికి ఏడేళ్ల జస్వంత్, మూడేళ్ల కౌశిక్ అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆరు నెలల క్రితం వరకూ రాఘవరావు చేనులు అగ్రహారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వద్ద లారీ డ్రైవర్‌గా పనిచేసేవాడు, అక్కడ మానేసి ప్రస్తుతం తాపీపని చేస్తున్నాడు. తాగుడుకు బానిసై దొరికినచోటల్లా అప్పులు చేశారు. చిన్నచిన్న చిల్లర దొంగతనాలు కూడా చేసేవాడు. వీటిని భరించలేని భార్య, ఇతడితో గొడవపడి రెండేళ్ల క్రితం పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి రాఘవరావు ఒంటిరిగానే ఉంటున్నాడు. అప్పులు తీర్చలేక, భార్య తన వద్ద లేకపోవడంతో మానసిక వేదనకు గురయ్యేవాడు. చివరకు మనస్తాపం చెంది మంగళవారం రాత్రి పశువుల కల్లం వద్ద గల పాకలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై బుధవారం ఉదయం మృతుడి తండ్రి కొండబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ పిన్నింటి రమణ తెలిపారు.

## ఒడిశా పోలీసుల ఎదుట మావోయిస్టు లొంగుబాటు

**సీలేరు, ఆగస్టు 21 :** ఛత్తీస్‌గఢ్ క్యాడర్ మావోయిస్టు ముఖేష్ కొరస అలియాస్ సూర్య ఎదుట లొంగిపోయిన ట్టు మల్కాన్‌గిరి జిల్లా ఎస్పీ నితీష్ వాద్వానీ ఒక ప్రకటనలో తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లోఅత్యంత కీలకమైన మావోయిస్టు నేత హిడ్మాకు ముఖేష్ కొరస ముఖ్య అనుచరుల్లో ఒకరని, అతను 2023లోమావోయిస్టు పార్టీలో దండకారణ్య ఎస్‌జెడ్‌సీగా కొనసాగారని చెప్పారు. అతనిపై ఒడిశాలో రూ.2 లక్షల రివార్డు ఉందన్నారు. లొంగిపోయిన మావోయిస్టుకు పునరావాసం, ఉపాధి కల్పిస్తామని ఆయన తెలిపారు.

## కోల్‌కతాలో ఘటనపై న్యాయ విశ్వ విద్యాలయం విద్యార్థుల ఆందోళన


ర్యాలీ నిర్వహిస్తున్న వీసీ సూర్యప్రకాశరావు, వైద్యులు, విద్యార్థులు

**సబ్బవరం, ఆగస్టు 21:** కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనకు నిరసనగా బుధవారం సాయంత్రం సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో విద్యార్థులు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ మాట్లాడుతూ కోల్‌కతాలో జరిగిన ఘటనతో దేశం యావత్తు దిగ్భ్రాంతికి గురైందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుజాత (గైనకాలజిస్టు, స్టీల్‌ప్లాంట్ జనర్ ఆసుపత్రి), డాక్టర్ కె.సుధ, డాక్టర్ టి.వై.నిర్మల డాక్టర్ భాగ్యలక్ష్మితో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

| చికెన్ ధరలు | |
|---|---|
| బ్యాగ్ | రూ.లలో |
| రైతు ధర | 98.00 |
| లైవ్ ధర | 118.00 |
| విత్ స్కిన్ | 206.00 |
| స్కిన్ లెస్ | 216.00 |

| కోడి గుడ్లు (నెక్) | |
|---|---|
| వంద గుడ్లు | రూ.లలో |
| విశాఖపట్నం | 505 |
| విజయనగరం | 509 |
| శ్రీకాకుళం | 509 |

# 20 మంది గిరిజన విద్యార్థుల డిశ్చార్జ్

- ఐటీడీఏ అంబులెన్స్‌లతో స్వగ్రామాలకు పంపిన అధికారులు
- మరో ఇద్దరు విద్యార్థులకు కొనసాగుతున్న చికిత్స

**నర్సీపట్నం/కొయ్యూరు, ఆగస్టు 21 :** కలుషిత ఆహారం తిని తీవ్ర అస్వస్థతతో ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 20 మంది గిరిజన విద్యార్థులు కోలుకోవడంతో బుధవారం డిశ్చార్జ్ చేసి వారి స్వగ్రామాలకు పంపించారు. కోటవురట్ల మండలం కైలాసపట్నంలోని పాసా అనాథ ఆశ్రమంలో శనివారం రాత్రి కలుషిత ఆహారం తిని ముగ్గురు విద్యార్థులు చనిపోవడంతో పాటు పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. సోమవారం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో 60 మంది విద్యార్థులు చేరగా, మెరుగైన వైద్యం కోసం 39 మందిని విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. మిగిలిన 21 మంది విద్యార్థులు మంగళవారం ఏరియా ఆస్పత్రిలో ఇన్ పేషెంట్ విభాగంలో చికిత్స తీసుకున్నారు. అదే రోజు రాత్రి మరో గిరిజన విద్యార్థి అనారోగ్యంతో ఏరియా ఆస్పత్రిలో చేరింది. బుధవారం ఈ 22 మంది విద్యార్థుల్లో 20 మంది కోలుకోవడంతో ఏరియా ఆస్పత్రి వైద్యులు డిశ్చార్జ్ చేశారు. పాంగి రాణి, పాంగి జ్యోతిల ఆరోగ్యం ఇంకా కుదుట పడకపోవడంతో ఆస్పత్రిలో ఉంచి చికిత్స అందిస్తున్నారు.


గిరిజన విద్యార్థులను అంబులెన్స్‌లో స్వగ్రామాలకు పంపిస్తున్న అధికారులు

డిశ్చార్జ్ చేసిన వారిని స్వగ్రామాలకు పంపడానికి ఐటీడీఏకి సంబంధించి ఆరు అంబులెన్స్‌లు ఏర్పాటు చేశారు. కోటవురట్ల తహసీల్దార్ 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు కుటుంబ సభ్యులకు అందజేశారు. నర్సీపట్నం ఆర్డీవో జయరాం, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నాగశిరీష, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటలక్ష్మమ్మ, ఏటీడబ్ల్యూవో పి.క్రాంతికుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# మూడేళ్ల బాలికపై వృద్ధుడి అఘాయిత్యం

- పోలీసుల అదుపులో నిందితుడు
- కఠినంగా శిక్షించాలని మహిళా సంఘాల డిమాండ్

**కోటవురట్ల, ఆగస్టు 21 :** ముక్కుపచ్చలారని మూడేళ్ల బాలికపై ఓ వృద్ధుడు అఘాయిత్యానికి ఒడిగట్టాడు. సభ్య సమాజం నివ్వెరపోయేలా జరిగిన ఈ ఘటన అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలంలో బుధవారం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి ఎస్ఐ రమణయ్య తెలిపిన వివరాలివి. మండలంలోని ఓ గ్రామంలో మూడేళ్ల బాలికను సమీపంలో ఉంటున్న 65 ఏళ్ల వృద్ధుడు కోట పాములు చాక్లెట్లు, బిస్కెట్లు కొనిస్తానని మాయమాటలు చెప్పి బుధవారం ఉదయం తన ఇంటికి తీసుకువెళ్లాడు.కుమార్తె కనిపించకపోవడంతో ఆమె తల్లి చుట్టుపక్కల వెతుకుతోంది. ఈలోగా పాములు ఇంట్లో నుంచి బయటకు వస్తూ బాలిక తల్లిని చూసి కంగారుపడ్డాడు. వెంటనే అతని ఇంట్లోకి వెళ్లిన ఆమె అక్కడ తన కుమార్తె ఉండడం చూసి నిర్ఘాంతపోయింది. బాలిక శరీరంపై స్వల్పగాయాలు ఉండడంతో పాములు ఘోరానికి ఒడిగట్టాడని గ్రహించింది. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని, సదరు బాలికను నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రమణయ్య తెలిపారు. ఇదిలావుంటే, నిందితుడిని కఠినంగా శిక్షించాలని మహిళా సంఘాలు డిమాండ్ చేశాయి.

# వైజాగ్ ఫిల్మ్ క్లబ్ కోర్ కమిటీ రద్దు

- సర్వసభ్య సమావేశం తీర్మానం
- బైలా మార్చాలని నిర్ణయం
- వైసీపీ హయాంలో కోర్ కమిటీ పేరుతో ఆ పార్టీ నేతలతో శాశ్వత కమిటీ ఏర్పాటు

**విశాఖపట్నం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) :** వైజాగ్ ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ కోర్ కమిటీని రద్దు చేస్తూ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం) తీర్మానం చేసింది. తిమ్మాపురంలోని క్లబ్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఎక్కడా ఏ క్లబ్‌కు లేని విధంగా ఇక్కడ వైసీపీ పెద్దలు వారి హయాంలో కోర్ కమిటీ పేరుతో శాశ్వత కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. వారి తదనంతరం ఆయా కుటుంబాల వారసులే అందులో ఉండేలా బైలా మార్చేశారు. ఈ విషయాలన్నీ గతంలో 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకువచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జూన్ 22న క్లబ్‌కు వెళ్లి సభ్యులతో సమావేశం నిర్వహించారు. సినిమా పరిశ్రమకు సంబంధం లేని వారి చేతుల్లోకి సంస్థ వెళ్లిందని, అంతా నియమావళి ప్రకారం జరగాలని, ఏకపక్షంగా ఏర్పాటైన కమిటీ తప్పుకోవాలని సూచించారు. ఇది జరిగిన కొద్దిరోజులకే మేనేజ్‌మెంట్ కమిటీ మొత్తం స్వచ్ఛందంగా రాజీనామా చేసింది. ఆ కమిటీ అధ్యక్షుడిగా వైసీపీ నాయకుడు కాయల వెంకటరెడ్డి, కార్యదర్శిగా శ్రీనివాసరాజు, కోశాధికారిగా ఎస్ఆర్ గోపీనాథ్‌రెడ్డి తదితరులు ఉన్నారు. ఇప్పుడు వారంతా ఆయా బాధ్యతల నుంచి తప్పుకున్నారు. బుధవారం నిర్వహించిన ఏజీఎంలో కోర్ కమిటీని రద్దు చేశారు. ఏకపక్షంగా రూపొందించిన బైలాను సరిచేసి, అక్టోబరు నాటికి కొత్త కమిటీని ఎన్నుకోవాలని ఏజీఎం నిర్ణయించింది. ఈ సందర్భంగా క్లబ్ పూర్వ అధ్యక్షుడు కేఎస్ రామారావు మాట్లాడుతూ, 1,400 మంది సభ్యుల విజ్ఞప్తి మేరకు తగిన చర్యలు చేపట్టిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మార్గదర్శకత్వంలో క్లబ్‌ను అభివృద్ధి చేస్తామన్నారు.

# సెప్టెంబరు 14న జాతీయ లోక్ అదాలత్

- ప్రిన్సిపల్ సివిల్ జడ్జి రాజేంద్రబాబు



**చోడవరం, ఆగస్టు 21:** వచ్చే నెల 14న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా అధికారులు కృషి చేయాలని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి మండల లీగల్‌సెల్ అధ్యక్షులు ఇ.రాజేంద్రబాబు కోరారు. బుధవారం స్థానిక కోర్టు ఆవరణలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించిన అంశాలపై మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్‌ల ద్వారా కేసుల సత్వర పరిష్కారం లభిస్తుందని, రాజీకి అవకాశం ఉన్న కేసులు పరిష్కరించుకునేలా కక్షిదారులకు అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీపీ వేసలపు వెంకటరావు, పోలీస్, ఎక్సైజ్‌శాఖల అధికారులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ టీడీపీ నాయకుడు మృతి


గోకాడ సన్యాసిదేముడు

**చీడికాడ, ఆగస్టు 21:** ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన బైలపూడి గ్రామానికి చెందిన టీడీపీ గ్రామ శాఖ మాజీ అధ్యక్షుడు గోకాడ సన్యాసిదేముడు (40) చికిత్స పొం దుతూ మృతి చెందారు. ఈ నెల 11న సబ్బవరం నుంచి చోడ వరం వైపు బైక్‌పై వస్తుండగా అడ్డూరు- నర్సాపురం గ్రామాల మధ్యలోకి వచ్చేసరికి చోడవరం వైపు నుంచి వస్తున్న వ్యాన్ ఢీకొనడంతో సన్యాసినాయుడు తీవ్రంగా గాయపడ్డారు. విశాఖ డెయిరీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి బుధవారం సాయంత్రం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు.

# అధికారుల తీరు మారాలి

▸▸ తప్పుడు సమాచారం ఇస్తున్నారు ▸▸ సమస్యలు పెడచెవిన పెడుతున్నారు

▸▸ నక్కపల్లి మండల సమావేశంలో పలువురు సభ్యులు ధ్వజం



సమావేశాన్ని నిర్వహిస్తున్న ఎంపీపీ రత్నం తదితరులు

**నక్కపల్లి, ఆగస్టు 21 :** కొందరు అధికారులు తమకు సరైన సమాచారం ఇవ్వడం లేదని నక్కపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పలువురు సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం అధ్యక్షతన బుధవారం ఏర్పాటైన సమావేశంలో వేంపాడు, కాగిత ఎంపీటీసీ సభ్యులు కుంచె మధు, ఆకేటి గోవిందరావు మాట్లాడారు. కొన్ని శాఖల అధికారుల పనితీరు బాగోలేదని ఆరోపించారు. వేంపాడు హైస్కూల్‌లో నాడు- నేడు పథకానికి సంబంధించి నిధుల వివరాలను అడిగితే సకాలంలో ఇవ్వలేదని ఎంపీటీసీ సభ్యుడు మధు ఆవేదన వ్యక్తం చేశారు. ఏదైనా సమాచారం అడిగితే కొందరు తప్పుడు సమాచారం ఇస్తున్నారని కాగిత ఎంపీటీసీ సభ్యుడు ఆకేటి గోవిందరావు అసంతృప్తి వ్యక్తం చేశారు. కొందరు అధికారులు రాజకీయ నాయకుల్లా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. చినతీనార్లలో బోరు తవ్వమని చాలాకాలం నుంచి కోరుతున్నా పట్టించుకునేవారు లేరని ఎంపీటీసీ సభ్యుడు వాసుపల్లి అప్పలస్వామి తెలిపారు. దీనిపై స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగభూషణం మాట్లాడుతూ గ్రామ పెద్దలంతా కలిసి ఒక నిర్ణయానికి వస్తే వెంటనే బోరు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనెల 23వ తేదీ అన్ని గ్రామాల్లో సభలు జరుగుతాయని, స్థానికంగా ఉన్న సమస్యలను చర్చించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ అంబేడ్కర్, ఏవో డి.సీతారామరాజు, జడ్పీటీసీ సభ్యురాలు కాసులమ్మ, వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావుతో పాటు ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

## సెజ్‌లో ప్రమాదంపై ఎంపీ సీఎం రమేష్ దిగ్భ్రాంతి

**కొత్తూరు, ఆగస్టు 21 :** అచ్యుతాపురం సెజ్‌లోని 'ఎసెన్షియా' ఫార్మా పరిశ్రమలో జరిగిన ప్రమాదంపై అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జిల్లాలో సంబంధిత అధికారులతో వెంటనే ఫోన్‌లో మాట్లాడి ప్రమాదంలో గాయపడి వారికి మెరుగైన వైద్యం అందించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టాలన్నారు. ఆసుపత్రి, సంఘటనా స్థలం వద్ద స్థానిక నాయకులంతా అందుబాటులో ఉండి క్షతగాత్రులకు సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఇదిలావుంటే, అచ్యుతాపురం సెజ్‌లో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటూ కార్మికులు మృతి చెందడం విస్మయం కలిగిస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాలు జరిగితే కార్మికులను తక్షణమే ఆదుకునేలా సెజ్‌లో ఆసుపత్రి నిర్మిస్తామని గత నాయకుల హామీ కార్యరూపం దాల్చలేదన్నారు.

### క్షతగాత్రులకు ఎమ్మెల్యే 'కొణతాల' పరామర్శ

**తుమ్మపాల :** సెజ్‌లోని ఎసెన్షియా పరిశ్రమలో రియాక్టర్ పేలడంతో గాయపడిన వారిని అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయం, ఉషాప్రైమ్ ఆసుపత్రులకు తరలించారు. ఉషాప్రైమ్ ఆస్పత్రిలో 15 మంది క్షతగాత్రులు చేరగా, వైద్యం పొందుతూ ఒకరు మృతి చెందారు. మిగిలిన 14 మందిని మెరుగైన వైద్యం కోసం విశాఖలోనిఆస్పత్రులకు తరలించే ఏర్పాట్లు చేపట్టారు. క్షతగాత్రులను అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పరామర్శించారు. వైద్యానికి సంబంధించి పూర్తి బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని చెప్పారు.

## విరుచుకుపడిన మృత్యువు

... 5వ పేజీ తరువాయి

వెళుతున్నారు. ఈలోగా భారీ శబ్దం వినిపించింది. దీంతో బీ-షిఫ్ట్ కార్మికులు ఉలిక్కి పడి వెనక్కి పరుగులు తీశారు. అప్పటికి ఏ-షిఫ్ట్ ఉద్యోగులు కొందరు పరుగులు తీసి బయటకు వచ్చారు. ఒక షిఫ్ట్‌కి ఇక్కడ 80 మంది పనిచేస్తారు. కర్మాగారంలో సుమారు 40 మంది కార్మికులు చిక్కుకుపోయారు. ఏం జరిగిందో తెలియదు, దట్టమైన పొగలు వ్యాపించాయి. భారీ పేలుడు సంభవించడంతో రియాక్టర్ పేలిందని కార్మికులు తెలుసుకున్నారు. లోనికి వెళ్లడానికి ఎవరూ సాహసించలేకపోయారు. అయినా ధైర్యం చేసి తోటి కార్మికులు కర్మాగారంలోకి ప్రవేశించారు. కర్మాగారంలో చెల్లాచెదురుగా కార్మికులు పడిపోయి ఉన్నారు. ఒంటి నిండా తీవ్ర గాయాలు, కొందరు స్పృహ కోల్పోయారు. దీంతో కర్మాగారంలో హాహాకారాలు మిన్నంటాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లు, కర్మాగారం బస్సుల్లో అచ్యుతాపురం ప్రైవేటు ఆస్పత్రులకు తరలించారు. ఎంతమంది బయటకు వచ్చారో?, ఎంతమంది కర్మాగారం లోపల ఉన్నారో తెలియని పరిస్థితి. కెమికల్‌తో కూడిన దట్టమైన పొగ కర్మాగార భవనం మొత్తం ఆక్రమించడంతో సహాయక చర్యలకు అంతరాయం కలిగింది. హైడ్రోజన్ గ్యాస్ సిలిండర్ కూడా పేలడంతో ప్రమాద ఉధృతి పెరిగిందని అంటున్నారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ దళాలు వచ్చిన తరువాత సహాయక చర్యలు చురుకుగా సాగాయి. భవన శిథిలాల కింద చిక్కుకుపోయి ఛిద్రమైన మృతదేహాలను వెలికి తీశారు.

### అనకాపల్లి ఆస్పత్రుల్లో క్షతగాత్రులు

**అనకాపల్లి టౌన్/తుమ్మపాల, ఆగస్టు 21 :** అచ్యుతాపురం సెజ్‌లోని 'ఎసెన్షియా' అడ్వాన్స్‌డ్ సైన్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో బుధవారం జరిగిన పెను ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఉద్యోగులకు ఎన్టీఆర్ వైద్యాలయం, పట్టణంలోని ఉషాప్రైమ్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. తీవ్రంగా గాయపడిన ఎస్‌ఈజెడ్ కాలనీ మోటూరుపాలెం గ్రామానికి చెందిన పూడి మోహనదుర్గాప్రసాద్(20), కాకినాడకు చెందిన సీహెచ్ హారిక (22)లు ఎన్టీఆర్ వైద్యాలయానికి తీసుకువచ్చేసరికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. ఉషాప్రైమ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిలో విజయనగరం జిల్లాకు చెందిన పి.రాజశేఖర్ (23) కూడా మృతి చెందాడు. అచ్యుతాపురానికి చెందిన వై.చిన్నారావు(32) మృతి చెందడంతో ఆయన మృతదేహాన్ని కూడా ఎన్టీఆర్ వైద్యాలయానికి తీసుకువచ్చారని సూపరింటెండెంట్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సంఘటనలో తీవ్ర గాయాలకు గురై ఎన్టీఆర్ వైద్యాలయానికి వచ్చిన వారిలో తణుకు సమీపాన దువ్వ గ్రామానికి చెందిన బాబా శ్రీనివాసవర్మ, విజయనగరానికి చెందిన జి.చైతన్య, ఏలూరుకు చెందిన కె.సత్యనారాయణ, పి.మోహనసతీశ్‌లు వైద్యసేవలు పొందారు. వీరిలో బాబా శ్రీనివాసవర్మకు బలమైన గాయాలు కావడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించామని, మిగిలిన ముగ్గురికి ఎటువంటి ప్రాణహాని లేదని డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. సంఘటన విషయం తెలుసుకున్న అడిషనల్ ఎస్పీ దేవప్రసాద్ ఎన్టీఆర్ వైద్యాలయానికి వచ్చి సంఘటనలో మృతి చెందిన, క్షతగాత్రుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తీవ్రంగా గాయపడి ఉషాప్రైమ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 14 మందిలో విజయనగరానికి చెందిన పి. రాజశేఖర్ (23) మృతి చెందగా, కె.చంద్రశేఖర్, జె.వరహాలరావు, జి.రాజా, బి.సూరిబాబు, కె. రాంబాబు, ఎం.కిరణ్ సత్యనారాయణ, బి.శివ వెంకటరత్నం, డి.అప్పారావు, ఆర్.వరలక్ష్మి, ఎస్. యామిని, కె.నారాయణరావు, ప్రభాత్‌యాదవ్, బంగారు చందకనాయుడు చికిత్స పొందుతున్నారు. వీరిలో రాంబిల్లికి చెందిన కె. రాంబాబు పరిస్థితి విషమయంగా ఉందని వైద్యులు తెలిపారు. అచ్యుతాపురం పవన్‌సాయి ఆస్పత్రిలో 13 మంది చికిత్స పొందుతున్నారు. చికిత్స పొందుతున్న వారిలో ఎ.పరమేశ్, టి.శ్రీనివాస్, ఎం.లోవ శ్రీనివాస్, పి.దేముడు, పి.జగదీశ్వరరావు, పి.జగదీశ్, టి.ధనుంజయ్, టి.గంగాధర్, కె.కాశీరామ్, జి.సంతోశ్, జి.సాయికుమార్, జె.ప్రకాశ్, ఎస్.అప్పారావులు ఉన్నారు.

### బాధితుల కన్నీరుమున్నీరు

ఈ ప్రమాదంలో పూడి మోహనదుర్గాప్రసాద్ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు ఎన్టీఆర్ వైద్యాలయంలో కన్నీరుమున్నీరుగా విలపించారు. తాను ఉదయం డ్యూటీకి వెళ్లి వచ్చేశానని, తన తమ్ముడు మోహనదుర్గాప్రసాద్ మధ్యాహ్నం డ్యూటీకి వెళ్లి మృతి చెందాడని అతని అన్న నానిబాబు విలపించాడు. ఇంటర్ చదివిన తన తమ్ముడు ఖాళీగా ఉండడం ఇష్టం లేక నెలకు రూ.12వేల జీతానికి ఏడాది క్రితం విధుల్లో చేరాడన్నారు.



ఎలమంచిలి : దిమిలి రోడ్డు జంక్షన్‌లో దళిత సంఘాల మానవహారం



పాయకరావుపేటలోని తాండవ నదిపై మూతపడిన షాపింగ్ కాంప్లెక్స్

# బంద్ ప్రశాంతం

▸▸ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దళిత సంఘాలు ఆందోళన

▸▸ పలు చోట్ల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు మూత

▸▸ 'పేట'లో స్వచ్ఛందంగా షాపులు మూసివేసిన వ్యాపారులు



నక్కపల్లి మండలం గొడిచెర్ల హైస్కూల్ వద్ద నినాదాలు



పాయకరావుపేటలో రహదారిపై బైఠాయించిన నాయకులు

**పాయకరావుపేట, ఆగస్టు 21 :** ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బుధవారం దేశవ్యాప్తంగా చేపట్టిన బంద్ పాయకరావుపేటలో విజయవంతమైంది. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళన సందర్భంగా ఇక్కడి విద్యా సంస్థలకు సెలవు ప్రకటించగా, అన్ని వ్యాపార సంస్థలు, షాపులను యజమానులు స్వచ్ఛందంగా మూసివేశారు. ఆర్టీసీ బస్సులు, కంపెనీల బస్సులు ఎక్కడికక్కడ నిలిచిపోగా ఆటోలు, ఇతర వాహనాలను ఆందోళనకారులు అడ్డుకున్నారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు భారీ ర్యాలీ నిర్వహించడంతో పాటు స్థానిక తాండవ జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై బైఠాయించి ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన సుప్రీం కోర్టు తీర్పును రద్దు చేయాలని నినాదాలు చేశారు. దళిత నాయకులు పెదపాటి మేఘరంజన్, నెలపర్తి అర్జున్, ఇంజరపు సూరిబాబు, కువలకుమార్, తాటిపాక లోవరాజు, ఐఎన్ మూర్తి, నెలపర్తి నాగరాజు, పల్లా ప్రసాద్, ముక్కుడుపల్లి దాసు, చిరుకూరి పేర్రాజు, పల్లి దుర్గారావు, పులగల అప్పలనర్స, భద్రరావు, ముక్కుడుపల్లి నాగరాజు, గారా రమేశ్, చంటి, పయ్యా నాని, నాగు తదితరులు పాల్గొన్నారు.

**అనకాపల్లి టౌన్ :** ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా స్థానిక నెహ్రూచౌక్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కార్యదర్శి బోని గణేష్ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై పునః పరిశీలన చేయాలని గణేష్ కోరారు. సుప్రీం తీర్పు వల్ల మాల సామాజికవర్గానికి అన్యాయం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుకు వచ్చి వర్గీకరణ బిల్లుపై కేంద్రంతో మాట్లాడి మాలలకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.


**నక్కపల్లి :** ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పునకు నిరసనగా బుధవారం దళిత సంఘాల ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో పాఠశాలలను దళిత సంఘాల ప్రతినిధులు మూసివేయించారు. గొడి చెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దళిత సంఘ ప్రతినిధులు వారా గాంధీ, యాకబ్, యాదిగిరి వీర్రాజు, బొండాడ సూరిబాబు, క్రిస్టోఫర్, మల్లారపు ప్రసాద్ తదితరులు ఆందోళన చేశారు.

**ఎస్.రాయవరం :** ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ నిర్వహించిన బంద్ మండలంలో ప్రశాంతంగా సాగింది. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ప్రతినిధులు పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను, దుకాణాలను మూయించారు. పలు పరిశ్రమలకు చెందిన బస్సులను నిలిపివేశారు. ఎంపీటీసీ బైపా శ్రీను, గారా శ్రీను, గారా సతీష్, జె.శ్రీను, కృష్ణ తదితర నాయకులు, యువకులు పాల్గొన్నారు.

**కోటవురట్ల :** ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మండలంలోని పలు గ్రామాల్లో దళిత నాయకులు బంద్ నిర్వహించారు. కోటవురట్లలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతో పాటు కొడవటిపూడిలో యూపీ స్కూల్‌ని మూయించారు. ఈ సందర్భంగా ఆందోళనకారులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేపట్ట వద్దని నినాదాలు చేశారు. కె.వెంకటాపురంలో అంబేడ్కర్ యువసేన, రత్నాలపాలెంలో డైనమిక్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో వై.అర్జునరావు, బోడపాటి రామకృష్ణ, మట్ల అప్పారావు, గుడాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**ఎలమంచిలి :** ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బుధవారం చేపట్టిన భారత్ బంద్ ఎలమంచిలిలో ప్రశాంతంగా సాగింది. దిమిలి రోడ్డు జంక్షన్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం ప్రతినిధుల ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించి, నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు గారా మురళీరాజు, గంపాన అప్పారావు, బి.అప్పారావు, జి.కాసులు, ఇ.చంటి, కె.జీవన్‌కుమార్, జి.శివ, ఎం.నవీన్, కె.రాము, అంబేడ్కర్ యూత్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కొత్త సీఐలు బాధ్యతల స్వీకరణ



వెంకట నారాయణ, అనకాపల్లి ట్రాఫిక్ సీఐ



స్వామినాయుడు కశింకోట సీఐ



కుమారస్వామి, నక్కపల్లి సీఐ

**అనకాపల్లి టౌన్, ఆగస్టు 21 :** ఇటీవల జరిగిన సీఐల బదిలీల్లో భాగంగా వారికి కేటాయించిన చోట్ల బుధవారం పలువురు బాధ్యతలు స్వీకరించారు. అనకాపల్లి ట్రాఫిక్ సీఐగా ఎం.వెంకటనారాయణ బాధ్యతలు చేపట్టారు. ఏపీ ట్రాన్స్‌కో విజిలెన్స్ విభాగంలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి విచ్చేశారు. ఇంతవరకు ఈ స్థానంలో ఉన్న పైడపునాయుడును విశాఖ రేంజ్ వీఆర్‌కు బదిలీ చేశారు. అనకాపల్లి పట్టణ పోలీస్ స్టేషన్ సీఐగా టీవీ విజయ్‌కుమార్ బుధవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు విజయనగరం సోషల్ మీడియా సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు. ఇంత వరకు ఈ స్థానంలో ఉన్న శంకరరావు విజయనగరం జిల్లా చీపురుపల్లికి బదిలీ అయ్యారు.

**నక్కపల్లి :** నక్కపల్లి సీఐగా బాధ్యతలు చేపట్టిన కుమారస్వామిని బుధవారం మండలంలోని పలు పార్టీలకు చెందిన నాయకులు కలిసి సత్కరించారు. బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు కోసూరి శ్రీను, జనసేన మండల శాఖ అధ్యక్షుడు వెలగా సుధాకర్, దేవవరపు లోవరాజు, రాంబాబు, వైసీపీ మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి సీఐకి పుష్పగుచ్ఛాలను అందజేసి దుశ్శాలువలతో సత్కరించారు.

**కశింకోట :** కశింకోట సీఐగా అల్లు స్వామినాయుడు బుధవారం బాధ్యతలు చేపట్టారు. అల్లూరి జిల్లా రాజవొమ్మంగిలో పనిచేస్తున్న ఈతనిని బదిలీపై ఇక్కడ ఉన్నతాధికారులు నియమిచారు. ఇం తవరకు ఈ స్థానంలో సీఐ వినోద్ బాబు విశాఖపట్నం ఏఆర్‌కు బదిలీ అయ్యారు.

## కోల్‌కతా ఘటనపై వివిధ సంఘాల ఆందోళన



అనకాపల్లి నెహ్రూచౌక్ బస్టాప్ వద్ద నిరసన తెలియజేస్తున్న దృశ్యం




గాజువాక- ఎలమంచిలి మెయిన్ రోడ్డుపై విద్యార్థినులు ఆందోళన

**అనకాపల్లి టౌన్, ఆగస్టు 21 :** కోల్‌కతాలో హత్యాచార ఘటనను ఖండిస్తూ బుధవారం సీఐటీయూ, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని నెహ్రూచౌక్ బస్టాప్ వద్ద నిరసన చేపట్టారు. జూనియర్ డాక్టర్‌పై అఘాయిత్యానికి పాల్పడి, హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, బాలికలకు, మహిళలకు రక్షణ కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి.రమణమ్మ, ఇందిరా, రామలక్ష్మి, సూర్య, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

**పరవాడ :** కోల్‌కతా ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలోని గాజువాక-ఎలమంచిలి మెయిన్ రోడ్డుపై సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా సంయుక్త ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. కళాశాల విద్యార్థినులు మానవహారంగా ఏర్పడి హత్యాచారానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలంటూ నినాదాలు చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, ఎస్ఎఫ్ఐ నాయకులు కె.ప్రశాంతి, పి.అనిత, కె.లావణ్య, బి.గౌరీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళలపై హింసను ప్రభుత్వాలు అరికట్టాలి

▸▸ ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి



సదస్సులో మాట్లాడుతున్న అధ్యక్షురాలు ప్రభావతి

**కశింకోట, ఆగస్టు 21 :** మహిళలపై జరుగుతున్న అరాచకాలను ప్రభుత్వాలు అరికట్టాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి డిమాండ్ చేశారు. 'మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలి' అనే అంశంపై బుధవారం ఇక్కడి విశ్వభారతి జూనియర్ కళాశాలలో ఏర్పాటైన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళలపై దాడులు, అరాచకాలు, అఘాయిత్యాలకు పాల్పడిన వారికి కఠినమైన శిక్షలు విధించకపోవడం అన్యాయమన్నారు. మహిళలకు రక్షణ కల్పించే నిర్భయ వంటి చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని కోరారు. ప్రజల ప్రాణాలను కాపాడుతున్న మహిళా డాక్టర్లను సైతం చిత్ర హింసలకు గురిచేసి, అఘాయిత్యాలకు పాల్పడుతుండడం దారుణమన్నారు. జస్టిస్ వర్మ కమిషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని, మహిళల రక్షణకు పటిష్టమైన చట్టాలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి డి.డి.వరలక్ష్మి, సీఐటీయూ నాయకులు దాకారపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## గౌరమ్మకు లక్ష కుంకుమార్చన



భక్తుల కుంకుమ పూజలు (అంతర్ చిత్రం) గౌరీమాత

**అనకాపల్లి టౌన్, ఆగస్టు 21 :** పట్టణంలోని గౌరీ పంచాయతన ఆలయంలో గౌరీపరమేశ్వరి అమ్మవారి ప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా బుధవారం ఆలయ మండపంలో సామూహికంగా దంపతులచే లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. వర్తక సంఘం అధ్యక్షులు కొణతాల లక్ష్మీనారాయణ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. గౌరీ సేవా సంఘం అధ్యక్షులు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### నేడు అనకాపల్లిలో మరిడిమాంబ ఉత్సవం



**అనకాపల్లి టౌన్, ఆగస్టు 21 :** పట్టణంలోని పలు ప్రాంతాల్లో గురువారం మరిడిమాంబ ఉత్సవం జరగనుంది. కోట్నివీధి, గవరపాలెం నూకాంబిక ఆలయ సమీపం, సతకంపట్టులో అమ్మవారి ఉత్సవాన్ని నిర్వహించేందుకు నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. పెద్ద ఎత్తున విద్యుద్దీపాలంకరణతో ఆయా ప్రాంతాలు దగదగలాడుతున్నాయి. తెల్లవారుజామున అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు కోట్నివీధి ఆలయ చైర్మన్ కోట్ని పూర్ణచంద్రరావు తెలిపారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు, నేలవేషాలు, ప్రబల ఊరేగింపు, బాణసంచా కాల్పులు వంటి ఉంటాయని వివరించారు. నూకాంబిక ఆలయం వద్ద గల మరిడిమాంబ ఆలయంలో కూడా ఈ ఉత్సవం నేత్రపర్వంగా నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు.

### జి.జగన్నాథపురంలో మరణమ్మతల్లి జాతర



**నక్కపల్లి, ఆగస్టు 21 :** జి.జగన్నాథపురంలో గ్రామ దేవత మరిణమ్మతల్లి జాతర గురువారం జరగనుందని గ్రామ పెద్దలు తెలిపారు. ఇందుకు సంబంధించి ఆలయ కమిటీ భారీ ఏర్పాట్లు చేపట్టింది. ఉదయం ఆరు గంటల నుంచి అమ్మవారి ఆలయంలో దర్శనాలు ప్రారంభమవుతాయని ఉప సర్పంచ్ మారిశెట్టి నానాజీ తెలిపారు.

### రేపు సామూహిక కుంకుమార్చన

**పరవాడ, ఆగస్టు 21 :** ఇ.బోనంగి ఫార్మాసిటీ పునరావాస కాలనీ వద్ద గల కొండపై కొలువుదీరిన అభయ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాసం మూడో శుక్రవారం సందర్భంగా ఉదయం పది గంటలకు సామూహిక కుంకుమార్చన నిర్వహించనున్నామని ఆలయ ప్రధాన అర్చకులు శ్రీహరి కృష్ణామాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు.

### గెస్ట్ లెక్చరర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు

**పరవాడ, ఆగస్టు 21 :** ఇక్కడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫిజిక్స్, హిందీ సబ్జెక్టుల బోధనకు గెస్ట్ లెక్చరర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పీవీ కళ్యాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ ఫిజిక్స్, ఎంఏ హిందీలో 50 శాతం మార్కులు పైబడి ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు అర్హులుగా పేర్కొన్నారు. గురువారం ఉదయం పది గంటల లోగా సంబంధిత విద్యార్హత ధ్రువపత్రాలను దరఖాస్తుకు జత చేసి కళాశాలలో అందజేయాల్సిందిగా ఆమె కోరారు.

### 'కల్లు గీత కార్మికులకు న్యాయం చేయండి'

**నక్కపల్లి, ఆగస్టు 21 :** విశాఖ- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం మండలంలోని పలు గ్రామాల్లో భూములు సేకరించినందున తాటి, ఈత చెట్లు కోల్పోవడంతో కల్లుగీత కార్మికుల జీవనోపాధి దెబ్బతిందని, ప్రభుత్వం వారికి న్యాయం చేయాలని ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు కోరారు. బుధవారం పలువురు గీత కార్మికులను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2013 భూసేకరణ చట్టంప్రకారం పద్దెనిమిది సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క గీత కార్మికుడికి రూ.15 లక్షలు ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఎం.రాజేశ్, కల్లుగీత కార్మిక సంఘం ప్రతినిధులు పి.మాధవస్వామి, బి.అప్పలరాజు, జి.రాజు, పి.తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

### కళాశాలలో బ్యాగులు, పుస్తకాలు పంపిణీ

**నక్కపల్లి, ఆగస్టు 21 :** విద్యారంగానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని, విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని నక్కపల్లి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి సూచించారు కళాశాలలో విద్యార్థులకు బుధవారం బ్యాగులు, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

### 'రోగులకు మెరుగైన వైద్యం అందించాలి'

**అనకాపల్లి టౌన్, ఆగస్టు 21 :** ఇక్కడి ఎన్టీఆర్ వైద్యాలయంలో మౌలిక సదుపాయాలు కల్పించి, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం కోరారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో బుధవారం మండల కమిటీ ఆధ్వర్యంలో జరిగిన శిక్షణ తరగతుల్లో మాట్లాడారు. వైద్యాలయంలో సౌకర్యాలు లేకపోవడంతో కేసులను వైద్యులు కేజీహెచ్‌కు రిఫర్ చేస్తున్నారన్నారు. అలాగే అనకాపల్లి ప్రాంతంలో ప్రభుత్వ భూములు, దేవదాయ భూములు పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు పెంటకోట శ్రీనివాసరావు, గంటా శ్రీరామ్, కె.తేలయ్యబాబు, భీశెట్టి అప్పారావు, జి.సుభాషిణి పాల్గొన్నారు.

### వరి పొలాల్లో కాలి బాటలతో మేలు

**కశింకోట, ఆగస్టు 21 :** వెదురుపర్తిలో బుధవారం పొలం బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారిణి స్వప్న రైతులకు వరి పంటలకు సంబంధించి పలు సూచనలు చేశారు. వరి ఆకు ఊడ్చిన తరువాత ఒకటి రెండు రోజులకు ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల చొప్పున కాలిబాటలు తీసుకోవాలన్నారు. దీనివల్ల సుడిదోమ నుంచి పంటను రక్షించుకోవచ్చన్నారు. గాలి పైరుకు తగిన దుబ్బులకు అధిక ఆక్సిజన్ లభిస్తుందని తెలిపారు.

### యువతి అదృశ్యంపై కేసు నమోదు

**అనకాపల్లి టౌన్, ఆగస్టు 21 :** ఓ యువతి అనకాపల్లిలో అదృశ్యమైనట్టు ఆమె తల్లి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇందుకు సంబంధించి హెడ్‌కానిస్టేబుల్ బి.రామకృష్ణ తెలిపిన వివరాలివి. బుచ్చెయ్యపేటకు చెందిన యువతి సోమవారం కుటుంబ సభ్యులతో అనకాపల్లిలో ఉంటున్న కుటుంబ సభ్యుల ఇంటికి వచ్చింది. తగరపువలసలో ఏఎన్ఎంగా శిక్షణ పొందుతున్న ఈమె, తిరిగి హాస్టల్‌కు బయలుదేరి వెళ్లిపోయినట్టు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. అయితే వార్డెన్ మీ కుమార్తె హాస్టల్‌కు చేరలేదని చెప్పడంతో తల్లి మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది.



## గ్రామ సభలకు ఏర్పాట్లు పూర్తి



కశింకోటలో మాట్లాడుతున్న డీఎల్‌డీవో మంజులావాణి



సబ్బవరం సమీక్షలో మాట్లాడుతున్న ఎంపీడీవో

**కశింకోట, ఆగస్టు 21 :** ప్రతి పంచాయతీలో ఈనెల 23వ తేదీ శుక్రవారం జరగనున్న గ్రామ సభల్లో ఉపాధి హామీ పథకంలో చేపట్టనున్న పనులను గుర్తించి, చదివి వినిపించాలని డీఎల్‌డీవో మంజూలావాణి సూచించారు. బుధవారం ఇక్కడి ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. గ్రామ సభల్లో ఆమోదించిన పనులు మాత్రమే నిర్వహించాలన్నారు. అనంతరం గ్రామ సభలు నిర్వహణ, మార్గదర్శకాలను వివరించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఎ.రవికుమార్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

**ఎలమంచిలి :** మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని ఎంపీడీవో అప్పలనాయుడు తెలిపారు. మేజర్ పంచాయతీలో ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభమవుతుందన్నారు. మిగిలిన పంచాయతీల్లోనూ నిర్దేశించిన సమయాల్లో జరుగుతాయని వివరించారు. కార్యదర్శుల పర్యవేక్షణలో జరిగే ఈ సభలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**సబ్బవరం :** ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా శుక్రవారం నిర్వహించనున్న గ్రామ సభలను పక్కాగా నిర్వహించాలని ఎంపీడీవో రమేశ్‌నాయుడు సూచించారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వ్యవసాయ, ఉద్యాన, ఉపాధి, పశు సంవర్థక, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖల అధికారులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. ఐదేళ్లలో గ్రామాల అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన సూచించారు. ప్రాధాన్యతా క్రమంలో ప్రభుత్వం ప్రతి ఏడాది నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఈ సమావేశంలో ఏవో షేక్ బాబూరావు, ఈవోపీఆర్‌డీ మహేశ్, సీడీపీవో లలితకుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హిమబిందు, ఎంఈవో లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

**పరవాడ :** ఉపాధి హామీ పథకం గ్రామ సభలను పంచాయతీ పరిధిలోని సచివాలయాల వద్ద శుక్రవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వి.హేమసుందరరావు తెలిపారు. పెదముషిడివాడ పంచాయతీలో మధ్యాహ్నం మూడు గంటలకు గ్రామసభ నిర్వహించడం జరుగుతుందన్నారు. మిగతా అన్ని పంచాయతీల్లో ఉదయం ఏడు గంటలకే గ్రామసభలు జరుగుతాయని వివరించారు. ఈ సభలకు హౌసింగ్, వెటర్నరీ, ఆర్‌డబ్ల్యూఎస్ , పంచాయతీరాజ్ అధికారులతో పాటు పంచాయతీ కార్యదర్శులు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

## గ్రీన్ క్లబ్ లోగో ఆవిష్కరణ


గ్రీన్ క్లబ్ లోగో ఆవిష్కరిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

**నర్సీపట్నం, ఆగస్టు 21 :** పర్యావరణ పరిరక్షణ కోసం ఉపాధ్యాయులు తలపెట్టిన గ్రీన్ క్లబ్ లోగోను స్పీకర్ అయ్యన్నపాత్రుడు బుధవారం ఆవిష్కరించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ నిషేధం, మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టడం చాలా అవసరమని స్పీకర్ అన్నారు. ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడానికి ఎక్కువ మంది ముందుకు రావాలని పిలుపునిచ్చారు. నర్సీపట్నం గ్రీన్ సిటీగా చేయడానికి కృషి చేస్తామని డీజీనాథ్ అన్నారు. ఈ కార్యక్రమంలో జీవీ రమేశ్, కేవీ రమణ, మద్దు శ్రీనివాసరావు, కుంచే మురళి,బి.అప్పారావు పాల్గొన్నారు.

## అభివృద్ధిపై దృష్టి సారించాలి : నందిపల్లి


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణ

**నాతవరం, ఆగస్టు 21 :** గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను టీడీపీ నేతలు, కార్యకర్తలు గుర్తించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ పిలుపునిచ్చారు. బుధవారం నాతవరంలో నిర్వహించిన టీడీపీ మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 23 నుంచి గ్రామసభలు జరుగుతున్నాయన్నారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు కరక సత్యనారాయణ మాట్లాడుతూ కాలువలు, అక్విడెక్టుల మరమ్మతులు తదితర పనుల కోసం శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు దృష్టికి తీసుకెళ్ళడంతో కోటి 60 లక్షలతో ప్రతిపాదనలు పంపడం జరిగిందని నిధులు మంజూరైన తర్వాత పనులు చేపడతారని తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకుడు శెట్టి సతీశ్ మాట్లాడుతూ మండల కేంద్రంలో టీడీపీ శాశ్వత కార్యాలయ నిర్మాణానికి 10 సెంట్లు స్థలాన్ని సేకరించాలన్నారు. ఈ సమావేశంలో తాండవ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ పారుపల్లి కొండబాబు, మాజీ ఎంపీపీలు సింగంపల్లి సన్యాసిదేముడు, ఎన్.విజయ్‌కుమార్ అపిరెడ్డి మాణిక్యం, మండల తెలుగు యువత అధ్యక్షులు శెట్టి లోవ, నేతలు బంగారు సూరిబాబు, జీరెడ్డి రాజుబాబు, శెట్టి నానాజీ తదితరులు పాల్గొన్నారు.

## 23న 'ఉపాధి'పై గ్రామ సభలు


మాట్లాడుతున్న డీఎల్పీవో ఉదయశ్రీ

**మాకవరపాలెం, ఆగస్టు 21 :** ఈ నెల 23నఉపాధి పనులపై నిర్వహిస్తున్న గ్రామ సభలను విజయవంతం చేయాలని డీఎల్‌డీవో ఉదయశ్రీ పేర్కొ న్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ సభలో 60 రకాలకు సంబంధించిన పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలని సర్పంచ్‌లకు తెలిపారు. ప్రతి గ్రామంలోని సిమెంట్ రోడ్లతో పాటు సీసీ కాలువలు, డ్రైన్లు వంటి పనులతో పాటు వ్యవసాయానికి సంబంధించిన పనులను ఎంపిక చేసుకోవాలన్నారు. 23న అన్ని పంచాయతీల్లో గ్రామ సభలు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సీతామహాలక్ష్మి, ఏపీవో వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన విద్యార్థినికి ఆర్థిక సాయం


విద్యార్థిని అపర్ణకు సాయం అందజేస్తున్న టీడీపీ నేతలు

**నాతవరం ఆగస్టు 21 :** నాతవరంలో నిరుపేద విద్యార్థిని కర్రి అపర్ణకు ఎన్ఆర్ఐ శెట్టి సతీష్ అతని స్నేహితులు రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈమె తండ్రి సత్తిబాబు అనారోగ్యంతో మంచానికే పరిమితం కావడంతో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.15 వేల పెన్షన్ మంజూరు అయ్యేలా చర్యలు తీసుకున్నారు. టెట్ కోచింగ్ తీసుకుంటున్న అపర్ణ టీచర్ ఉద్యోగం సాధించాలని వీరు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## 23 నుంచి జాతీయ స్థాయి యోగా పోటీలు

**చోడవరం, ఆగస్టు 21 :** ఈ నెల 23 నుంచి బెంగుళూరు శివజ్యోతి యోగ కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఆన్‌లైన్ యోగా పోటీలు నిర్వహిస్తున్నట్టు యోగా అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుల్లేటి సతీష్ తెలిపారు. ఈ ఆన్‌లైన్ యోగా పోటీల్లో 8 నుంచి 80 సంవత్సరాల వరకూ కేటగిరీల వారీగా పోటీలు ఉంటాయని, ఆసక్తి కలిగిన యోగా క్రీడాకారులు పోటీలకు సంబంధించిన వివరాల కోసం ఫోన్ : 92912 76900లో సంప్రదించాలని కోరారు.

## 29న మరిడిమాంబ అమ్మవారి పండగ

**కృష్ణాదేవిపేట, ఆగస్టు 21 :** గొలుగొండ మండలంలోని ఏఎల్‌పురంలో ఈ నెల 29న గ్రామదేవత మరిడిమాంబ అమ్మవారి పండగ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు గొలుగొండ మాజీ జడ్పీటీసీ సభ్యుడు చిటికెల తారకవేణుగోపాల్ తెలిపారు. భక్తులకు అవసరమైన వసతుల కల్పన, గ్రామంలో విద్యుద్దీపాల అలంకరణ ఏర్పాటు చేశామని, పండగ రోజు పలు సాంస్కృతిక, జానపద ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనాలని కోరారు.

## వాకర్స్‌క్లబ్‌లో ఘనంగా వృద్ధుల దినోత్సవం


మాట్లాడుతున్న బ్యాంక్ మేనేజర్ రాజేష్

**చోడవరం, ఆగస్టు 21 :** స్థానిక లక్ష్మీపురం రోడ్ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం జాతీయ వృద్ధుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీఐసీ ఐ బ్యాంక్ మేనేజర్ రాజేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వృద్ధులకు సీనియర్ సిటిజన్లకు బ్యాంకు కల్పిస్తున్న రాయితీలు వడ్డీ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఓరుగంటి రాంబాబు, కార్యదర్శి జాజుల జగ్గారావు, వాకర్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# పాఠశాలల పనితీరులో విద్యా కమిటీలది కీలకపాత్ర

**ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి**

**మాడుగుల రూరల్, ఆగస్టు 21 :** పాఠశాలల అభివృద్ధి ఎస్ఎంసీ సభ్యులు, తల్లిదండ్రులు, కూటమి నాయకులు అంతా సమష్టిగా కృషి చేయాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి అన్నారు. బుధవారం మాడుగుల టీడీపీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన పాఠశాలల ఎస్ఎంసీ కమిటీ సభ్యులకు సన్మాన సభ ఏర్పాటు చేసి వారిని అభినందించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ అభివృద్ధే ధ్యేయంగా కూటమి పాలన కొనసాగుతుందన్నారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణతో పాటు పాఠశాల అభివృద్ధికి చేయాల్సిన పనుల్లో ఎస్ఎంసీ సభ్యులు సహకరించాలన్నారు. ఉపాధ్యాయులను కలసుకుని ఎప్పటికప్పుడు పాఠశాల స్థితిగతులు తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పుప్పాల అప్పలరాజు, అద్దిపల్లి జగ్గారావు, దేముడు, పైలా ప్రసాదరావు, మజ్జి తాతబాబు, గట్రెడ్డి శివాజీ, పుప్పాల రమేశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.


మాడుగులలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

**చీడికాడ :** విద్యా కమిటీ చైర్మన్లతో బుధవారం సాయంత్రం తులసీ కల్యాణమండపంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధిలో విద్యా కమిటీల చైర్మన్లు కీలక పాత్ర పోషించాలన్నారు. టీడీపీ మండల అధ్యక్షులు పోతల చిన్నంనాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేడపురెడ్డి శ్రీనివాసరావు, టీడీపీ నియోజకవర్గ నాయకులు పైలా ప్రసాదరావు, గండి ముసలినాయుడు, పోతల రమణమ్మ, కుచ్చు కళావతి, యర్రా అప్పారావు, బొబ్బాది తాతారావు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ వద్దు

**పలు చోట్ల మాలమహానాడు ఆధ్వర్యంలో ఆందోళనలు**

**చోడవరం, ఆగస్టు 21 :** మాలమహానాడు ఆధ్వర్యంలోభారత్‌బంద్ చేపట్టారు. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉదయం 7 గంటల నుంచి ఆందోళనకారులు రోడ్డుపై రాస్తారోకో చేపట్టి వాహనాలు నిలిపివేశారు. విద్యాసంస్థలను మూసివేయించారు. వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఆందోళనకారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి సియ్యాద్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ దళితులపై ప్రధాని మోదీ కుట్రలో భాగంగానే ఎస్సీ వర్గీకరణపై తీర్పు వెలువడిందని ఆరోపించారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు వేచలపు ప్రకాశ్, బూసి కోటి, ఓలిమరక ఈశ్వరరావు, రమేష్, చలపతిరావు, చందు, కొత్తపల్లి శ్రీనివాసరావు, దేవి, మట్టా అప్పలనరసమ్మ, వెంకటి, రాజారావు, గాడి నాగేశ్వరరావు, రాజారావు, మట్టా నరవి, త్రివిక్రమ్ పాల్గొన్నారు.

**నర్సీపట్నం :** ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ మాలల ఐక్య వేదిక ఆధ్వర్యంలో బంద్ చేపట్టారు. ఈ సందర్భంగా వేదిక ప్రతినిధులు అబీద్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూల వేసి వర్గీకరణ వద్దు అంటూ నినాదాలు చేశారు. ర్యాలీ చేపట్టి శ్రీకన్య కూడలిలో మానవహారం చేపట్టారు. చోడవరం, తుని, కేడీపేట రూట్లలో ఆర్టీసీ బస్సులు డిపోకు పరిమితమయ్యాయి. విశాఖపట్నం రూట్‌లో పరిమిత సంఖ్యలో బస్సులు నడిపారు. ఈ కార్యక్రమంలో మాలల ఐక్య వేదిక ప్రతినిధులు చిట్ల చలపతి, మర్రా గోపి, మర్రా అప్పలరాజు, రాజాన అప్పారావు, నేతల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

**బుచ్చెయ్యపేట :** రిజర్వేషన్ బచావో సంఘర్ష్ సమితి పిలుపు మేరకు వడ్డాది, విజయరామరాజుపేటలో మాలమహానాడు నాయకులు నిరసన చేపట్టారు. విద్యాసంస్థలు మూసివేయించారు. స్థానిక కూడలిలో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా యువజన అధ్యక్షుడు బూసి కోటి, మాడుగుల మండల వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాసరావు, ఏఐఎం మండలాధ్యక్షుడు శేఖర్, మాలమహానాడు సంఘం నాయకులు అప్పారావు, కామరాజు, మీసాల మోహన్, వీర్రాజు, మురళీ, లోవరాజు, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.


నర్సీపట్నం : అబిద్ సెంటర్‌లో మాలల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిరసన


బుచ్చెయ్యపేటలో మాలమహానాడు నేతల ఆందోళన

**గొలుగొండ :** ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఖండిస్తూ పలు గ్రామాల్లో దళితులు బుధవారం ర్యాలీలు నిర్వహించారు. జోగంపేట, గొలుగొండ గ్రామాల్లో మాజీ జడ్పీటీసీ దళిత నాయకుడు చిట్ల చలపతిరావు ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు.

**రోలుగుంట :** మండల డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో రోలుగుంటలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, దుకాణాలను మూసివేయించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట దర్నా నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ తీర్పును వెంటనే సుప్రీంకోర్టు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిడారి మల్లేశ్వరరావు, గుడాల శివ పాల్గొన్నారు.

**నాతవరం :** అంబేడ్కర్ ఇండియా మిషన్ జిల్లా కో-కన్వీనర్ చేబ్రోలు సాల్మన్‌రాజ్ ఆధ్వర్యంలో నాతవరంలో ర్యాలీ నిర్వహించారు. మూడు రోడ్ల కూడలిలో మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో బోసు పరదేశి, బోడ్డు ప్రవీణ్ సామర్ల అనిల్ పాల్గొన్నారు.

**కృష్ణాదేవిపేట :** గొలుగొండ మండలం ఏఎల్‌పురంలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం, ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, దుకాణాలు స్వచ్ఛందంగా మూసివేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, జిల్లా వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత, అంబేడ్కర్ యూత్ నాయకులు కాళ్ల సత్తిబాబు, కర్రి ప్రకాష్, గోకాడ రాజు, కె.దుర్గాప్రసాద్, సీహెచ్.స్టాలిన్, పూతి రాజుబాబు పాల్గొన్నారు.

**దేవరాపల్లి :** ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో రైవాడ అతిథిగృహం నుంచి నాలుగు రోడ్లు వరకు ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహం ముందు నిరసన తెలిపారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. ఈ కార్యక్రమంలో కాటపల్లి అప్పారావు, కార్లి సాయిసుందర్, వేచపు గంగాధర్, నాగభూషణం, మాలిబాబు తదితరులు పాల్గొన్నారు.


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు

## గొండుపాలెంలో మెగా వైద్య శిబిరం

**కె.కోటపాడు, ఆగస్టు 21 :** మండలంలోని గొండుపాలెంలో గొండుపాలెం పంచాయతీ, సమాజ మిత్ర వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి, కేర్ హాస్పిటల్, వాసవీ ఐ కేర్ హాస్పిటల్ సంయుక్త నిర్వహణలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, టీడీపీ సీనియర్ నాయకులు పైలా ప్రసాద్ సంయుక్తంగా రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఎమ్మెల్యే బండారు నేత్ర పరీక్షలను చేయించుకున్నారు. ఈ శిబిరంలో స్త్రీలకు ఉచిత క్యాన్సర్ వైద్య పరీక్షలు, ఈసీజీ రక్త పరీక్షలు, నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రెసిడెంట్ రొంగలి మహేష్, ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘం చాంబర్ అధ్యక్షులు దాడి ఎరుకునాయుడు, సర్పంచ్ బండారు కనక మల్లేశ్వరిపాల్గొన్నారు.

## అల్లూరి పార్కులో డీఎస్సీ మెటీరియల్ ఏర్పాటు


డీఎస్సీ మెటీరియల్‌ను అందజేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

**కృష్ణాదేవిపేట, ఆగస్టు 21 :** ఉపాధ్యాయ నియామక పరీక్ష డీఎస్సీకి సిద్ధమయ్యే నిరుద్యోగ యువత కోసం గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట అల్లూరి సీతారామరాజు పార్కులో డీఎస్సీ, టెట్ మెటీరియల్ అందుబాటులో ఉంచారు. గత జూలై 4న అల్లూరి పార్కులో అల్లూరి జయంతికి విచ్చేసిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావుని ఇక్కడ నిరుద్యోగ యువత కోసం పోటీ పరీక్షల మెటీరియల్ అందించాలంటూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు కోరారు. ఈ క్రమంలో బుధవారం ఎమ్మెల్సీ పంపిన కాంపిటీషన్ మెటీరియల్‌ను చింతకాయల అయ్యన్నపాత్రుడి చేతుల మీదుగా మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, ఇతర టీడీపీ నాయకులకు నర్సీపట్నంలో అందజేశారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ నిరుద్యోగులు ఈ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## అయ్యన్నకు మరిడిమాంబ ఆలయ నిర్వహణ బాధ్యతలు

**నర్సీపట్నం, ఆగస్టు 21 :** దేవదాయ శాఖ అధికారులు శ్రీమరిడిమాంబ ఆలయ నిర్వహణ బాధ్యతలను వ్యవస్థాపక ధర్మకర్త, స్పీకర్ అయ్యన్నపాత్రుడుకి తిరిగి అప్పగించారు. బుధవారం దేవదాయ శాఖ అధికారులు స్పీకర్‌ను కలిసి ఈ విషయాన్ని వివరించారు.

పూర్వం నుంచి మరిడితల్లి ఆలయం నిర్వహణ, పండగ అయ్యన్నపాత్రుడు కుటుంబీకులే చూసుకునే వారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రెండేళ్ల క్రితం మరిడితల్లి అలయాన్ని దేవదాయశాఖ పరిధిలోకి తీసుకున్నారు. అయితే ఆలయ నిర్వహణ అధికారులు పట్టించుకోలేదు. దీంతో మరిడిమాంబ ఆలయాన్ని తిరిగి అప్పగించాలని ఎండోమెంట్ కమిషనర్ అయ్యన్నపాత్రుడు లేఖ రాశారు. ఆ లేఖను పరిశీలనలోకి తీసుకున్న దేవదాయ శాఖ అధికారులు అయ్యన్నపాత్రుడుకు ఆలయ నిర్వహణ బాధ్యతలు అప్పగించారు.


స్పీకర్ అయ్యన్నపాత్రుడితో మాట్లాడుతున్న దేవదాయ శాఖ అధికారులు

## 'అమ్మ పేరిట మొక్క నాటుదాం'

**బుచ్చెయ్యపేట, ఆగస్టు 21 :** మాతృమూర్తులు తమ పిల్లలను ఎలా సంరక్షించుకుంటారో అలాగే ఒక చెట్టు కూడా పర్యావరణాన్ని రక్షిస్తోందని పరస్పర సహకార సంఘం చైర్మన్ గంగలక్ష్మి పేర్కొన్నారు. ఆమె బుధవారం కొండపాలెంలో అమ్మకు ఒక చెట్టు కార్యక్రమంలో భాగంగా స్థానికులకు మొక్కలు పంపిణీ చేశారు. జీడిమామిడి మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు తమ తల్లుల పేరిట ఒక మొక్కను నాటాలని సూచించారు.


మొక్క అందజేస్తున్న గంగలక్ష్మి

# విరుచుకుపడిన మృత్యువు

... 5వ పేజీ తరువాయి

వెళుతున్నారు. ఈలోగా భారీ శబ్దం వినిపించింది. దీంతో బీ-షిఫ్ట్ కార్మికులు ఉలిక్కి పడి వెనక్కి పరుగులు తీశారు. అప్పటికి ఏ-షిఫ్ట్ ఉద్యోగులు కొందరు పరుగులు తీసి బయటకు వచ్చారు. ఒక షిఫ్ట్‌కి ఇక్కడ 80 మంది పనిచేస్తారు. కర్మాగారంలో సుమారు 40 మంది కార్మికులు చిక్కుకుపోయారు. ఏం జరిగిందో తెలియదు, దట్టమైన పొగలు వ్యాపించాయి. భారీ పేలుడు సంభవించడంతో రియాక్టర్ పేలిందని కార్మికులు తెలుసుకున్నారు. లోనికి వెళ్లడానికి ఎవరూ సాహసించలేకపోయారు. అయినా ధైర్యం చేసి తోటి కార్మికులు కర్మాగారంలోకి ప్రవేశించారు. కర్మాగారంలో చెల్లాచెదురుగా కార్మికులు పడిపోయి ఉన్నారు. ఒంటి నిండా తీవ్ర గాయాలు, కొందరు స్పృహ కోల్పోయారు. దీంతో కర్మాగారంలో హాహాకారాలు మిన్నంటాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లు, కర్మాగారం బస్సుల్లో అచ్యుతాపురం ప్రైవేటు ఆస్పత్రులకు తరలించారు. ఎంతమంది బయటకు వచ్చారో?, ఎంతమంది కర్మాగారం లోపల ఉన్నారో తెలియని పరిస్థితి. కెమికల్‌తో కూడిన దట్టమైన పొగ కర్మాగార భవనం మొత్తం ఆక్రమించడంతో సహాయక చర్యలకు అంతరాయం కలిగింది. హైడ్రోజన్ గ్యాస్ సిలిండర్ కూడా పేలడంతో ప్రమాద ఉధృతి పెరిగిందని అంటున్నారు. ఎన్‌డీఆర్ఎఫ్ దళాలు వచ్చిన తరువాత సహాయక చర్యలు చురుకుగా సాగాయి. భవన శిథిలాల కింద చిక్కుకుపోయి ఛిద్రమైన మృతదేహాలను వెలికి తీశారు.

### అనకాపల్లి ఆస్పత్రుల్లో క్షతగాత్రులు

**అనకాపల్లి టౌన్/ తుమ్మపాల :** అచ్యుతాపురం సెజ్‌లోని 'ఎసెన్షియా' అడ్వాన్స్‌డ్ సైన్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో బుధవారం జరిగిన పెను ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఉద్యోగులకు ఎన్టీఆర్ వైద్యాలయం, పట్టణంలోని ఉషాప్రైమ్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. తీవ్రంగా గాయపడిన ఎస్ఈజెడ్ కాలనీ మోటూరుపాలెం గ్రామానికి చెందిన పూడి మోహనదుర్గాప్రసాద్(20), కాకినాడకుచెందిన సీహెచ్ హారిక (22)లు ఎన్టీఆర్ వైద్యాలయానికి తీసుకువచ్చేసరికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. ఉషాప్రైమ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిలో విజయనగరం జిల్లాకు చెందిన పి.రాజశేఖర్ (23) కూడా మృతి చెందాడు. అచ్యుతాపురానికి చెందిన వై.చిన్నారావు(32) మృతి చెందడంతో ఆయన మృతదేహాన్ని కూడా ఎన్టీఆర్ వైద్యాలయానికి తీసుకువచ్చారని సూపరింటెండెంట్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సంఘటనలో తీవ్ర గాయాలకు గురై ఎన్టీఆర్ వైద్యాలయానికి వచ్చిన వారిలో తణుకు సమీపాన దువ్వ గ్రామానికి చెందిన బాబా శ్రీనివాసవర్మ, విజయనగరానికి చెందిన జి.చైతన్య, ఏలూరుకు చెందిన కె.సత్యనారాయణ, పి.మోహనసతీశ్‌లు వైద్యసేవలు పొందారు.వీరిలో బాబా శ్రీనివాసవర్మకు బలమైన గాయాలు కావడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించామని, మిగిలిన ముగ్గురికి ఎటువంటి ప్రాణహాని లేదని డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. సంఘటన విషయం తెలుసుకున్న అడిషినల్ ఎస్పీ దేవప్రసాద్ ఎన్టీఆర్ వైద్యాలయానికి వచ్చి సంఘటనలో మృతి చెందిన, క్షతగాత్రుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తీవ్రంగా గాయపడి ఉషాప్రైమ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 14 మందిలో విజయనగరానికి చెందిన పి. రాజశేఖర్ (23) మృతి చెందగా, కె.చంద్రోశేఖర్, జె.వరహాలరావు, జి.రాజా, బి.సూరిబాబు, కె.రాంబాబు, ఎం.కిరణ్ సత్యనారాయణ, బి.శివ వెంకటరత్నం, డి.అప్పారావు, ఆర్.వరలక్ష్మి, ఎస్. యామిని, కె.నారాయణరావు, ప్రభాత్‌యాదవ్, బంగారు చందక నాయుడు చికిత్స పొందుతున్నారు. వీరిలో రాంబిల్లికి చెందిన కె. రాంబాబు పరిస్థితి విషమయంగా ఉందని వైద్యులు తెలిపారు. అచ్యుతాపురం పవన్‌సాయి ఆస్పత్రిలో 13 మంది చికిత్స పొందుతున్నారు. చికిత్స పొందుతున్న వారిలో ఎ.పరమేశ్, టి.శ్రీనివాస్, ఎం.లోవ శ్రీనివాస్, పి.దేముడు, పి.జగదీశ్వరరావు, పి.జగదీశ్, టి.ధనుంజయ్, టి.గంగాధర్, కె.కాశీరామ్, జి.సంతోశ్, జి.సాయికుమార్, జె.ప్రకాశ్, ఎన్.అప్పారావు ఉన్నారు.

### బాధితుల కన్నీరుమున్నీరు

ఈ ప్రమాదంలో పూడి మోహనదుర్గాప్రసాద్ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు ఎన్టీఆర్ వైద్యాలయంలో కన్నీరుమున్నీరుగా విలపించారు. తాను ఉదయం డ్యూటీకి వెళ్లి వచ్చేశానని, తన తమ్ముడు మోహనదుర్గాప్రసాద్ మధ్యాహ్నం డ్యూటీకి వెళ్లి మృతి చెందాడని అతని అన్న నానిబాబు విలపించాడు. ఇంటర్ చదివిన తన తమ్ముడు ఖాళీగా ఉండడం ఇష్టం లేక కేవలం నెలకు రూ.12 వేలు జీతానికి ఏడాది క్రితం విధుల్లో చేరాడని తెలిపారు.

## విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు



నేత్ర వైద్య పరీక్షలు చేయించుకుంటున్న విద్యార్థులు

**కె.కోటపాడు, ఆగస్టు 21 :** మండలంలోని చౌడువాడ జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు శంకర్ ఫౌండేషన్ వైద్యులు బుధవారం ఉచితంగా నేత్ర పరీక్షలు నిర్వహించారు. అవసరమైన విద్యార్థులకు కళ్ళజోళ్ళు, మందులు అందించారు. శంకర్ ఫౌండేషన్ వైద్యులు డాక్టర్ అయిన్, డాక్టర్ రోహిత్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో హెచ్ఎం బోకం సన్నిబాబు, ఆప్తాల్మిస్ట్ డాక్టర్ చందన, ఆస్పత్రి సిబ్బంది లావణ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

## పీఏసీఎస్‌లో మలి విడత విచారణ

▸▸ పలువురు రైతుల నుంచి వివరాలు ఆరా

**రోలుగుంట, ఆగస్టు 21 :** మండలంలోని జానకిరాంపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)లో జరిగిన అవకతవకలపై మలివిడత ఆ శాఖ నర్సీపట్నం సీనియర్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ మరిడియ్య బుధవారం జానకిరాంపురం పీఏసీఎస్‌లో విచారణ నిర్వహించారు. పీఏసీఎస్‌లో చోటుచేసుకున్న అక్రమాలు, రుణాలు తీసుకోనప్పటికీ తీసుకున్నట్టు రికార్డుల్లో ఉండడం తదితర అవకతవకలపై పలువురు రైతులు గత నెలలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంపై ఈ నెల 14న తొలిసారి విచారణ అధికారి రమణమూర్తి తదితరులు విచారణ చేపట్టి క్షుణ్ణంగా రికార్డులు పరిశీలించి సీఈవో కృష్ణను విచారించి నివేదిక రూపొందించారు. తాజాగా బుధవారం డివిజనల్ కో-ఆపరేటివ్ యలమంచిలి ఆదేశాల మేరకు విచారణ నిర్వహించారు. పలువురు రైతులను పిలిపించి విచారణ చేపట్టారు. వారి నుంచి వివరాలు సేకరించి రికార్డు చేశారు. అలాగే సీఈవో కృష్ణ నుంచి కూడా వివరాలు సేకరించి పీఏసీఎస్‌లో ఉన్న రికార్డులను సరిపోల్చారు. ఇది ఇంకా ప్రాథమిక దశ మాత్రమేనని విచారణ ఇంకా కొనసాగుతుందని మరిడియ్య తెలిపారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని తెలిపారు.

**☛ సంక్షిప్తంగా..**

## 25న చెకుముకి సైన్స్ సంబరాలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంఈవో తలుపులు

**నర్సీపట్నం, ఆగస్టు 21 :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సెప్టెంబరు 25న నిర్వహించే చెకుముకి సైన్స్ సంబరాలలో విద్యార్థులందరూ పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి తలుపులు అన్నారు. బుధవారం చెకుముకి సంబరాలు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు త్రిమూర్తులు రెడ్డి, విశ్రాంత గ్రంథాలయాధికారి మురళి పాల్గొన్నారు.

## కార్మికులను తప్పుదారి పట్టించవద్దు

**గోవాడ షుగర్స్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి**

**చోడవరం, ఆగస్టు 21 :** గోవాడ షుగర్ ఫ్యాక్టరీ కార్మికులను తప్పుదారి పట్టించే ఆందోళనలు చేపట్టవద్దని గోవాడ షుగర్స్ గుర్తింపు కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీఎస్ భాస్కరరావు పేర్కొన్నారు. గోవాడ ఫ్యాక్టరీ ఇబ్బందుల్లో ఉన్న సమయంలో ఫ్యాక్టరీని ఎలా గాడిలో పెట్టాలో ఆలోచించడం మాని, ప్రతిపక్ష కార్మిక సంఘం నేతలు అనవసర రాజకీయాలు చేయవద్దని బుధవారం ఒక ప్రకటనలో హితవు పలికారు.

## పకడ్బందీగా ఓటరు నమోదు

**కె.కోటపాడు, ఆగస్టు 21 :** బూత్ స్థాయి అధికారులందరూ ఇంటింటికి వెళ్లి ఓటర్ల నమోదు పక్కాగా నిర్వహించాలని స్థానిక తహసీల్దార్ రమేష్‌బాబు అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలతో బుధవారం సమావేశమయ్యారు. నెల రోజుల పాటు నిర్వహిస్తున్న ఓటర్ల నమోదు కార్యక్రమంలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలన్నారు. అవసరమైన చోట్ల అంగన్‌వాడీ ఆయాల సహకారంతో ఓటర్ల నమోదు పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఉప తహసీల్దార్ రమేష్, బీఎల్వోలు పాల్గొన్నారు.

## ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు

▸▸ ఇన్‌చార్జి తహసీల్దార్ భరత్‌కుమార్


ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

**గొలుగొండ, ఆగస్టు 21 :** మండలంలోని అమ్మపేటలో ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాలపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇన్‌చార్జి తహసీల్దార్ భరత్‌కుమార్, ఎస్ఐ కృష్ణారావు బుధవారం ఇక్కడ బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి తహసీల్దార్ మాట్లాడుతూ అమ్మపేటలో గల ప్రభుత్వ భూమిలో ఎటువంటి కట్టడాలు నిర్మాణాలు చేపట్టినా తొలగిస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుతం కట్టడాలు పూర్తి చేసిన వారికి నోటీసులు అందించామని తెలిపారు.

## 28న మండల పరిషత్ సమావేశం

**చోడవరం, ఆగస్టు 21 :** ఈ నెల 28న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఎస్టీ శ్యాంసుందర్ బుధవారం తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులంతా హాజరు కావాలని కోరారు.

## హిందువులపై దాడులకు నిరసన

**మాడుగుల రూరల్, ఆగస్టు 21 :** బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను నిరసిస్తూ మంగళవారం రాత్రి మాడుగులలో హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ర్యాలీ నిర్వహించి బస్టాండ్‌లో మానవహారం చేశారు. ప్రతీ హిందువు ఐకమత్యంతో మెలగాలని, ఇతర మతాలను హిందువులు ఎప్పుడూ గౌరవిస్తారన్నారు. హిందువులపై జరుగుతున్న దాడులను ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో దంగేటి సూర్యారావు, నాయుడు, పుట్టా గంగయ్య, మండల సతీశ్, సాధన శ్రీను, కోడూరు కొండలరావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## సాగులో లేని భూముల వివరాలు అందించండి : ఏవో

**రోలుగుంట, ఆగస్టు 21 :** వ్యవసాయ భూములుగా నమోదై, సాగు చేయకుండా ఉన్న భూములపై క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే చేపట్టి నివేదిక రూపొందించాలని మండల వ్యవసాయాధికారి విజయలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. పంటలకు అనుకూలంగా ఉండి, సాగు చేయని వాటి వివరాలను సర్వే నెంబర్ల వారీగా ఇవ్వాలని ఆదేశించారు. సెప్టెంబరు 15లోగా ఈ-క్రాప్ నమోదు చేసిన పంటలకు రైతులు ఈ-కేవైసీని నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ సోమశేఖర్, ఆర్ఐ రామమూర్తి, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ సీనియర్ కార్యకర్త మృతి



**మాడుగుల రూరల్, ఆగస్టు 21 :** టీడీపీ మాడుగుల సీనియర్ కార్యకర్త తుడుం నూకరాజు(68) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన పార్టీకి గతంలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా సేవలు అందించారు. పార్టీ సంబంధిత కార్యక్రమాలకు తప్పనిసరిగా పసుపు చొక్కా ధరించి హాజరయ్యేవారు. గురువారం ఉదయం మాడుగులలో ఆయన అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్టు టీడీపీ నాయకులు తెలిపారు. ఈయన మృతి పట్ల మాడుగుల పట్టణ, మండల టీడీపీ నాయకులు ప్రగాఢసానుభూతి తెలిపారు.